క్లుప్తంగా

స్వచ్ఛమైన తాగునీరందిస్తాం



మానవపాడు: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో బుధవారం ఎంపీడీఓ భాస్కర్, మిషన్ భగీరథ ఏఈ రాఘవేంద్ర ఆధ్వర్యంలో నీటి కనెక్షన్లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తాగునీరు కలుషితమవుతుందన్న గ్రామస్తుల ఫిర్యాదు మేరకు పర్యటించినట్లు తెలిపారు. గతంలో నీటి పరీక్షలు కూడా నిర్వహించామని తాగునీటిలో మురుగు కలవడం లేదన్నారు. గ్రామాల్లో నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

మల్దకల్: మండలంలోని మద్దెలబండ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు, లైన్ల వెంట చెట్ల కొమ్మలు తొలగింపు, ఇతర పనుల కారణంగా గురువారం మధ్యాహ్నం 3గంటల నుంచి 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ గోవిందు, ఏఈ రాజేష్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఇటిక్యాల: మండల పరిధిలోని వావిలాల, సాతర్ల గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ శేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 33/11 కేవీ నుంచి సాతర్ల గ్రామ పరిధిలోని 33 కేవీ కొత్తఫీడర్ ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ



గట్టు: మండల పరిధిలోని మల్లంపల్లి గ్రామంలో బుధవారం సీసీరోడ్డు నిర్మాణ పనులకు పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్ భూమిపూజ చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రూ. 10 లక్షల నిధులతో రోడ్డు ప్రారంభించినట్లు తెలిపారు. నిర్మాణ పనులు నాణ్యతగా, త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణారెడ్డి, హనుమంతురెడ్డి, రాజప్ప, మాజీ సర్పంచ్ తిమ్మప్ప, మాజీ ఉప సర్పంచ్ లక్ష్మణ్, చిన్న తిమ్మప్ప, బడేసాబ్, బోయ భీమేష్, చిన్న హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

చెత్త రిక్షాలు మూలకేనా!



ఉండవెల్లి: మండలంలోని తక్కశీల గ్రామంలో పంచాయతీ రిక్షాలు ముళ్లపొదల్లో దర్శనమిస్తున్నాయి. చెత్త సేకరించేందుకు రిక్షాలు ఉపయోగిస్తారు కానీ చెత్తను తరలించే రిక్షాలే మూలన పడేయడంతో అవస్థలు పడుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సైకిళ్లు అందజేయాలని వినతి



రాజోళి: విద్యార్థులకు సైకిళ్లు అందజేయాలని ఎంవీ ఫౌండేషన్ సభ్యులు చిరంజీవి ఫ్యాన్స్‌కు వినతిపత్రం అందచేశారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి విద్యార్థులు ఆయా పాఠశాలకు వెళ్లేందుకు 5 కి.మీల వరకు నడుచుకుంటూ వెళ్తున్నారని, బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నట్లు మండల కేంద్రంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంవీ ఫౌండేషన్ మండల ఇన్‌చార్జి హనిమిరెడ్డి తదిదరులు పాల్గొన్నారు.

నిధులు రాక నిరుపయోగం..

- అలంకార ప్రాయంగా రైతువేదికలు
- గ్రామాలకు దూరంగా ఏర్పాటు
- సొంత నిధులతో అధికారుల నిర్వహణ



నారాయణపురంలో ఊరికి దూరంగా ఉన్న రైతువేదిక

మానవపాడు: గ్రామాల్లో రైతువేదికల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. నిర్వహణకు నిధులు లేక నిరుపయోగంగా మారాయి. రైతువేదికల్లో కనీస సదుపాయాలు లేకపోవడంతో ఇటు అధికారులు అటు రైతులు అసౌకర్యానికి గురవుతున్నట్లు వాపోతున్నారు. కొన్ని గ్రామాల్లో సొంత నిధులతో నిర్వహణ సాగిస్తున్నట్లు పేర్కొంటున్నారు. సర్కార్ నుంచి నిధులు విడుదల కాకపోవడంతో వాటి పర్యవేక్షణ ప్రశ్నార్థకంగా మారింది. నిర్వహణ లేకపోవడంతో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి.

ఉన్నత లక్ష్యాలతో ఏర్పాటు

నాలుగేళ్ల క్రితం అప్పటి తెలంగాణ ప్రభుత్వం రైతువేదికలను నిర్మించింది. పంటల సాగుపై రైతులకు సూచనలు, సలహాలు, శిక్షణ తరగతుల నిర్వహణ, నూతన వంగడాలు, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అందుతున్నాయా..? లేదా..? పరిశీలించడం తదితర లక్ష్యాల కోసం ఏర్పాటు చేశారు. పంటలకు లభించే ధరల విషయమై రైతులు చర్చించుకుని సంఘటితం అయ్యేందుకు వేదికగా రైతు వేదికలు తోడ్పడతాయని ప్రభుత్వం భావించింది. ప్రతి 5 వేల మంది రైతులకు ఒక క్లస్టర్‌గా రైతువేదికలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

రూ.22 లక్షలతో నిర్మాణం..

రాష్ట్ర వ్యాప్తంగా ఒకే నమూనాలో నిర్మించేందుకు ఒక్కో రైతువేదికకు రూ. 22లక్షల వ్యయంతో అంచనాలు రూపొందించారు. వ్యవసాయశాఖ ద్వారా రూ. 12లక్షలు, గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రూ.10 లక్షలు మంజూ చేశారు. ప్రతి క్లస్టర్‌లో ఒక వ్యవసాయ విస్తరణ అధికారిని నియమించి రైతుల సమస్యలను పరిష్కారం పరిష్కరిస్తారు. పంటల సాగుపై శిక్షణ తరగతులు కూడా నిర్వహించేవారు.

కనీస వసతుల కరువు..

అలంపూర్ నియోజకవర్గంలోని 8 మండలాల్లో 124 గ్రామ పంచాయతీల్లో 54 రైతువేదికలు ఉన్నాయి. గ్రామాలకు దూరంగా నిర్మించడం, కనీసం సదుపాయాలు లేకపోవడం, నిధుల సమస్య కారణంగా విద్యుత్ చార్జీలు, మరుగుదొడ్ల నిర్వహణ కూడా సమస్యగా మారింది.

సొంత నిధులతో నిర్వహణ..

రైతువేదికల నిర్వహణకు ప్రభుత్వం నెలకు రూ. 3వేలు అందించింది. అనంతరం రూ.7500 నుంచి 9వేలు మంజూరు చేశారు. 2022 ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు నిధులు సక్రమంగా నిధులు మంజూరయ్యాయి. అనంతరం నిధులు విడుదల కాకపోవడంతో రైతువేదికల నిర్వహణ ఏఈఓలకు తలకు మించిన భారంగా మారింది. విద్యుత్ బిల్లులు, ఇతర ఖర్చులు వారు సొంతంగా చెల్లించాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రతి మంగళవారం రైతునేస్తం కార్యక్రమం పేరుతో పంటల సాగు విధానంలో నూతన పద్ధతులు, అధిక దిగుబడి విధానాలపై శాస్త్రవేత్తలు, నిపుణులు, వ్యవసాయ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. వాటి నిర్వహణ కూడా భారంగా మారిందని అధికారులు వాపోతున్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా రైతువేదికలకు నిధులు విడుదల చేసి అందుబాటులోకి తేవాలని నియోజకవర్గ రైతులు కోరుతున్నారు.

నివేదికలు పంపుతాం..

రైతువేదికల నిర్వహణ గురించి ఉన్నతాధికారులకు నివేదకలు పంపుతాము. నిర్వహణకు ఒకసారి మాత్రమే నిధులు విడుదలయ్యాయి. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన వెంటనే ఆయా క్లస్టర్ల వారిగా రైతువేదికల నిర్వహణకు నిధులు విడుదల చేస్తాం.

– సక్రియానాయక్, జిల్లా వ్యవసాయ అధికారి

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు రామచంద్రారెడ్డి

అయిజ: మండల కేంద్రంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లా నాయకుడు రామచంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం బీజేపీ మండల అధ్యక్షుడు గోపాల కృష్ణ, నాయకులు, కార్యకర్తలతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఒక రోజు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. 2020 సంవత్సరంలో అయిజలో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని అధికారులు తొలగించడంతో మండల ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. ప్రభుత్వం స్పందించి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటుచేయాలని లేనిపక్షంలో నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు శివారెడ్డి, నాగరాజు, శ్రీను, భీమసేన్‌రావు, లక్ష్మణ్ గౌడ్, నరసింహులు, వీరయ్య ఆచారి, రామకృష్ణ, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న భాగవత సప్తాహం



ఇటిక్యాల: మండల పరిధిలోని మునుగాల గ్రామంలో గ్రామ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భాగవత సప్తాహ మహోత్సవం 4వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు సత్యం రామనుజ దాస్ మాట్లాడుతూ.. ప్రతి మనిషికి లౌకిక ఆనందం తాత్కాలికం మాత్రమేనన్నారు. నిజమైన ఆనందం భాగవత ప్రవచనం ఆలకించడం, ఆచరించడం ద్వారానే అనుభవం పొందగలుగుతారన్నారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

రాజోళి: సినీ హీరో రాంచరణ్ జన్మదినం సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. తహసీల్దార్ పి.రామ్మోహన్, జెడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యుడు నిషాక్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు శివరామయ్య ఆధ్వర్యంలో సుశీల నేత్రాలయ సిబ్బంది 220 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. తమ అభిమాన హీరో జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రజల ఆరోగ్యం పట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం శుభపరిణామమని అతిథులు అభినందించారు. అనంతరం ఎస్ఎస్ఎస్ఆర్ ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చిరంజీవి, రాంచరణ్ అభిమానులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వసతులు కల్పించాలి

అమరచింత: గ్రామాల్లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు పని ప్రదేశంలో వసతులను కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ డిమాండ్ చేశారు. మండలంలోని పాంరెడ్డిపల్లిలో బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలను కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేసవి ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో పని ప్రదేశంలో నీడ, తాగు నీటి వసతి, ఆరోగ్య కిట్, ఆశావర్కర్లు ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కూలీలు ఎండదెబ్బ తగులకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. భూములు లేని, జాబ్ కార్డు కలిగిన కుటుంబాలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని వర్తింపచేయాలన్నారు. కార్యక్రమంలో శంకర్, రాజన్న, మొగిలన్న, చిట్టెమ్మ, సత్యమ్మలు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్..



వనపర్తిలో ఇఫ్తార్‌లో పాల్గొన్న మాజీ మంత్రి, మాజీ ఎంపీ

వనపర్తి: హిందూ, ముస్లింలు ఉగాది, రంజాన్ పండుగలను సోదరభావంతో జరుపుకోవాలని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలోని అన్ని మసీదులలో మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి ఇఫ్తార్‌విందులో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో వాకిటి శ్రీధర్, పలుస రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని ముస్లింలకు బుధవారం మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఆయన గ్రామంలోని బీఆర్ఎస్ నాయకులతో ఇఫ్తార్ ఏర్పాటు చేయించి ఫోన్‌లో ముస్లింతో మాట్లాడి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాళ్ల కృష్ణయ్య, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

యువ వికాసం.. ఉపాధికి సోపానం

- దరఖాస్తుల స్వీకరణకు ఏప్రిల్ 5 చివరి తేదీ
- రద్దీగా మారిన మీసేవ కేంద్రాలు



రాజీవ్ యువ వికాసం పోర్టల్



పాన్‌గల్‌లోని మీసేవ కేంద్రాల వద్ద బారులు తీరిన జనం

పాన్‌గల్: నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించి 'రాజీవ్ యువ వికాసం' పేరిట ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన 18 నుంచి 35 ఏళ్ల నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోసం రాయితీ రుణాలు పంపిణీ చేయనుంది. మూడు కేటగిరీల్లో అర్హతలను బట్టి ఒక్కో నియోజకవర్గానికి నాలుగు వేల నుంచి ఐదు వేల మంది యువతకు లబ్ధి చేకూరేలా ప్రణాళిక రూపొందించింది. కొన్నేళ్లుగా స్వయం ఉపాధి రుణాల పంపిణీ నిలిచిపోవడంతో నిరుద్యోగులు డబ్బుల్లేక సొంతంగా వ్యాపారం చేయడానికి ముందుకు రాలేకపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకం ద్వారా అవకాశం కల్పిస్తుండటంతో.. వారిలో మళ్లీ ఆశలు చిగురించాయి. కానీ దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన కులం, ఆదాయ ధ్రువపత్రాల కోసం కూడా రోజుల తరబడి వేచిచూడాల్సి వస్తుందని పలువురు వాపోతున్నారు.

రేషన్‌కార్డులో ఒక్క సభ్యుడికే..

ఒక రేషన్‌కార్డులో ఒక సభ్యుడికి మాత్రమే ఆర్థికసాయం పొందే అవకాశం ఉంటుంది. గతంలో ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం పొందిన వారు దరఖాస్తులను వెబ్‌సైట్ తీసుకోవడం లేదని, ప్రభుత్వం సహాయం పొంది ఏడేళ్ల లోపు అయిన లబ్ధిదారుల దరఖాస్తులు నమోదు అయ్యే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు. రేషన్ కార్డులో ఒక్క సభ్యుడికే అవకాశం అంటుండటం, కొందరికి రేషన్ కార్డులు లేకపోవడం, మరికొందరూ ఉమ్మడిగా ఉండటంతో చాలా మంది దరఖాస్తు చేసేందుకు ముందుకు రావడం లేదు.

మూడు విభాగాలుగా..

అర్హత కలిగిన వారు మీసేవ కేంద్రం, ఫోన్లలో tgobmmsnew.cgg.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుదారు ఆసక్తి ఉన్న రంగాన్ని ఎంచుకొని రేషన్ కార్డు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల వివరాలతో పాటు పాన్ నెంబర్ ఇవ్వాల్సి ఉంటుంది. సంబంధిత వ్యక్తి ఫొటో అప్‌లోడ్ చేయాలి. ఎంచుకున్న రంగాన్ని బట్టి మూడు విభాగాలుగా రుణాలు అందిస్తారు. మొదటి విభాగంలో రూ. లక్షకు 80 శాతం రాయితీ, మిగిలిన 20 శాతం బ్యాంకు రుణం ఇస్తుంది. రెండో విభాగంలో రూ.2 లక్షలకు 70 శాతం రాయితీ, 30 శాతం బ్యాంకు రుణం, మూడు కేటగిరీలో రూ. 3 లక్షలకు 60 శాతం రాయితీ పోను మిగిలింది బ్యాంకు నుంచి అందిస్తారు.

ఆఖరి తేదీ..

దరఖాస్తులు 5 ఏప్రిల్ 2025 వరకు స్వీకరించి ఏప్రిల్ 6 నుంచి మే 31వ తేదీ వరకు పరిశీలన చేస్తారు. జూన్ 2వ తేదీ రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజు లబ్ధిదారులకు ఆర్థికసాయం అందించనున్నారు.

పారదర్శకత పాటించాలి



రాజీవ్ యువ వికాసం పథకంలో లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకతను పాటిస్తూ అర్హులైన పేద కుటుంబాల నిరుద్యోగులకు అవకాశం కల్పించాలి. వ్యాపారం చేసుకొని ఉపాధి పొందే వారికే ప్రాధాన్యత ఇవ్వాలి. కొందరూ ప్రభుత్వ రాయితీ పొందడానికి మాత్రమే దరఖాస్తులు చేసుకుంటున్నారు.

– బాల్యనాయక్, సీపీఎం మండల కార్యదర్శి, పాన్‌గల్

పక్షపాతం చూపొద్దు



రాజీవ్ యువ వికాసం పథకంలో ఏమాత్రం పక్షపాతం చూపకుండా క్షేత్ర స్థాయిలో అర్హులను గుర్తించాలి. వ్యాపారం చేసుకుంటూ ఉపాధి పొందే వారికే అవకాశం కల్పించాలి.

– ఆంజనేయులు, డివైఎఫ్ఐ నాయకులు, రేమద్దుల

దరఖాస్తుల స్వీకరణ

రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు ఆన్‌లైన్‌లో ఏప్రిల్ 5వ తేదీ వరకు స్వీకరిస్తారు. ఆర్థిక సాయంపై విధివిధానాలు ప్రభుత్వం నుంచి అందలేదు. ప్రభుత్వ నిబంధనల మేరకు లబ్ధిదారులను ఎంపిక చేస్తాం.

– గోవింద్‌రావు, ఎంపీడీఓ, పాన్‌గల్

బీసీల కోసం ప్రత్యేక ఆర్డినెన్స్ తేవాలి



మాట్లాడుతున్న రాంబాబు

శాంతినగర్: రాష్ట్రంలో బీసీల రిజర్వేషన్ల కోసం కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకొచ్చే విధంగా రాష్ట్ర కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్లమెంట్ సభ్యులు ఒత్తిడి తీసుకురావాలని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆకెపోగు రాంబాబు అన్నారు. వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో బీఎస్పీ కార్యకర్తలతో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ.. చట్టసభల్లో రిజర్వేషన్లు బీసీల చిరకాల కోరిక అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బిల్లులను ఆమోదించి చేతులు దులుపుకోవడం సమంజసం కాదన్నారు. బీసీల రిజర్వేషన్ల కోసం కేంద్ర ప్రభుత్వంతో పోరాటం చేసి ఆమోదించే విధంగా చేయాలన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల మాదిరిగా బీసీలకు కూడా ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకురావడానికి కృషి చేయాలన్నారు. పలుమార్లు ఢిల్లీకి వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీల రిజర్వేషన్ల గురించి ప్రధాని మోదీని కలవడం లేదన్నారు. బీసీ సామాజిక వర్గంపై ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మణికుమార్, నాయకులు హనుమంతు, రాముడు, రమేష్, హేమంత్, వెంకట్‌నాయుడు పాల్గొన్నారు.

అభ్యుదయ కవిత్వంతో చైతన్యం



మాట్లాడుతున్న కవి సత్యనారాయణ

గద్వాలటౌన్: అభ్యుదయ కవిత్వం ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చిందని ప్రసిద్ధ కవి, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ అన్నారు. జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'అభ్యుదయ కవిత' అనే అంశంపై ఉపన్యాసం ఏర్పాటు చేశారు. ప్రాచీన కవిత్వం (నన్నయ యుగం) నుంచి భావకవిత్వం (దేవులపల్లి కృష్ణశాస్త్రి), అభ్యుదయ కవిత్వం (శ్రీశ్రీ) వరకు కవిత్వం– వాటి మధ్య భేదాలను వారివారి రచనలతో విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షేక్ కలందర్‌బాషా, జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు ప్రొఫెసర్ చెన్నకేశవరెడ్డి, ప్రభుత్వ పీజీ సెంటర్ ప్రిన్సిపాల్ చవ్వా వెంకటరెడ్డి, అధ్యాపకులు నాగభూషణం, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, శంకర్, రాములు, అంబటి భానుప్రకాశ్, ఇక్బాల్ అహ్మద్, క్రిష్ణయ్య, రఫీక్, రాముడు తదితరులు పాల్గొన్నారు.

బెట్టింగ్ యాప్‌ల జోలికెళ్లొద్దు



గట్టులో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

గట్టు: బెట్టింగ్ యాప్‌ల జోలికి వెళ్లవద్దని, బలవంతంగా బెట్టింగ్ చేయించిన నేరమవుతుందని ఎస్‌ఐ మల్లేష్ అన్నారు. బుధవారం గట్టులో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. గుర్తు తెలియని లింకులను క్లిక్ చేయవద్దని, అపరిచితులకు బ్యాంక్ ఖాతాల వివరాలు, ఓటీపీలు చెప్పవద్దన్నారు. యువత బెట్టింగ్ యాప్‌లకు అలవాటు పడి ఆత్మహత్యలు చేసుకుంటున్నట్లు తెలిపారు. బెట్టింగ్ యాప్‌లకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ అయ్యన్న, కానిస్టేబుళ్లు భీమేష్, హపినా, ఆరగిద్ద మధుసూదన్‌రెడ్డి, యలదొడ్డి గోవిందు, మాచర్ల, బోయలగూడెం, మిట్టదొడ్డి గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'పది' పరీక్షలు



ఇటిక్యాలలో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

మల్దకల్/అలంపూర్/ఇటిక్యాల/ఉండవెల్లి/మానవపాడు: మల్దకల్ మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, జెడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలలో బుధవారం పదో తరగతి గణిత పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు అధికారులు తెలిపారు. ఆయా పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు చీఫ్ సూపరింటెండెంట్లు భాస్కర్‌పాపన్న, సుదర్శన్ రెడ్డి, నర్సింహరెడ్డి తెలిపారు. పరీక్షకు మొత్తం 479 మంది విద్యార్థులకు గాను 478 మంది హాజరైనట్లు వారు పేర్కొన్నారు.

★ అలంపూర్ పట్టణంలోని రెండు పరీక్షా కేంద్రాల్లో 306 మంది విద్యార్థులకు గాను 305 మంది పరీక్షకు హాజరైనట్లు ఎంఈఓ అశోక్‌కుమార్ తెలిపారు. పరీక్షా కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ పరిశీలించినట్లు పేర్కొన్నారు.

★ ఇటిక్యాల మండల కేంద్రంలో పదో తరగతి పబ్లిక్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. వందశాతం విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు మండల విద్యాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు.

★ ఉండవెల్లి మండల కేంద్రంలోని పదో తరగతి పరీక్షకు 409 మంది విద్యార్థులకు గాను 407 మంది హాజరైనట్లు మండల విద్యాధికారి అశోక్ తెలిపారు. పుష్పావతి అనే యువతి పరీక్షకు ముందే బీపీ డౌన్ కావడంతో ఆర్ఎంపీ వైద్య పరీక్షలు నిర్వహించారు.

★ మానవపాడు మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి పరీక్ష కేంద్రాలను ఫ్లైయింగ్ స్క్వాడ్ తనిఖీ చేసింది. పరీక్షకు 280 మంది విద్యార్థులకు గానూ 278 మంది హాజరైనట్లు సూపరింటెండెంట్ శ్రీనివాసులు తెలిపారు.

ఆదిశిలా క్షేత్రంలో ప్రత్యేక పూజలు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రం స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అక్రమ అరెస్టులు సరికాదు



అమరచింత: సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీని అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని పట్టణంలో బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి జీఎస్.గోపి మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా పరిధిలోని రామోజీ ఫిలిం సిటీలో పేదలకు ఇచ్చిన భూములను పేదలకు పంచాలని పలుమార్లు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటి వరకు ఇళ్ల స్థలాలు ఇవ్వలేదన్నారు. దీంతో పేదలకు మద్దతుగా బుధవారం చలో రామోజీ ఫిలిం సిటీ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ శాంతియుతంగా నిరసన తెలపగా.. పోలీసులు లాఠీచార్జ్, అక్రమంగా అరెస్టు చేశారని మండిపడ్డారు. కార్యక్రమంలో వెంకటేష్, రాజు, అజయ్, ఆర్ఎన్.రమేష్, మాజీ సర్పంచ్ గోపాల్, శ్యాంసుందర్‌లు పాల్గొన్నారు.